స్విఫ్ట్ సీఎన్‌జీ వెర్షన్!

న్యూఢిల్లీ, మే 20: నాలుగో జనరేషన్‌గా మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చిన స్విఫ్ట్‌లో సీఎన్‌జీ మాడల్ కూడా త్వరలో అందుబాటులోకి రాబోతున్నది. ఆ దిశగా చర్యలు ప్రారంభించిన సంస్థ.. వచ్చే కొన్ని నెలల్లో ఈ మాడల్‌ను మార్కెట్లో విడుదల చేయబోతున్నది. 1.2 లీటర్ మూడు సిలిండర్ జెడ్-సిరీస్ ఎన్‌ఏ పెట్రోల్ ఇంజిన్‌తో తయారైన ఈ నాలుగో తరం స్విఫ్ట్ మాడల్ ప్రారంభ ధర రూ.6.49 లక్షలుగా నిర్ణయించింది. సీఎన్‌జీ వెర్షన్ ధర మాత్రం రూ.90 వేలు అధికంగా ఉండనున్నదని అంచనా. పెట్రోల్ వెర్షన్ 25 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనుండగా, సీఎన్‌జీ వెర్షన్ 32 కిలోమీటర్లు ఇవ్వనున్నది.

సీడీఎఫ్‌డీలో అంత్రప్రెన్యూర్ మీట్

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 20(నమస్తే తెలంగాణ): సెంటర్ ఫర్ డీఎన్‌ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్(సీడీఎఫ్‌డీ) అధ్యయన సంస్థలో మంగళవారం అంత్రప్రెన్యూర్ టాక్స్ పేరిట ప్రత్యేక సదస్సును నిర్వహించనున్నారు. లైఫ్ సైన్స్‌లో పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడమే లక్ష్యంగా జరుగుతున్న ఈ సదస్సుకు బయోలాజిక్స్ కంపెనీ సీఈవో గోపాల్‌కృష్ణన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించనున్నారు. సీడీఎఫ్‌డీలో వరుసగా అంత్రప్రెన్యూర్‌షిప్ నిర్వహించడంతో నిపుణులతో సమావేశాలు నిర్వహిస్తున్నది.

బడా బిజినెస్ స్కూళ్లలో ఐఎస్‌బీ టాప్

- ఎఫ్‌టీ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కస్టమ్ ర్యాంకింగ్ 2024 జాబితా విడుదల

న్యూఢిల్లీ, మే 20: దేశవ్యాప్తంగా ఉన్న టాప్ బిజినెస్ స్కూళ్లలో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ) తిరిగి తన తొలి స్థానాన్ని దక్కించుకున్నది. దేశీయంగా ఉన్న బిజినెస్ స్కూళ్లలో తొలి స్థానంతోపాటు ఆసియా వ్యాప్తంగా ఉన్న స్కూళ్లలో రెండో స్థానం లభించింది. ఫైనాన్షియల్ టైమ్స్ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కస్టమ్ ర్యాంకింగ్ 2024 విడుదల చేసిన జాబితాలో ఈ విషయాన్ని వెల్లడించింది. రెండోస్థానం ఎమ్లియన్ బిజినెస్ స్కూల్‌కు లభించింది. ఆ తర్వాతి స్థానాల్లో యార్క్ యూనివర్సిటీ, ఇండియన్ ఇనిస్టిట్యూషన్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) బెంగళూరు, ఐఐఎం అహ్మదాబాద్, ఐఐఎం ఇండోర్‌లు ఉన్నాయి.

అంతర్జాతీయంగా 26వ స్థానం

అంతర్జాతీయ బిజినెస్ స్కూళ్లలోనూ ఐఎస్‌బీ సత్తాచాటింది. గడిచిన సంవత్సరంలో 29వ స్థానంలో ఉన్న ఐఎస్‌బీ ర్యాంక్..ఈసారికిగాను మూడు స్థానాలు ఎగబాకి 26వ స్థానానికి చేరుకున్నది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న టాప్-100 బిజినెస్ స్కూళ్లకు ఈ ర్యాంకులు ఇచ్చినట్లు తెలిపింది. ముఖ్యంగా ఆయా బిజినెస్ స్కూళ్లు ఆఫర్ చేసే కోర్సులు, వ్యాపార వర్గాలు, కార్పొరేట్ క్లయింట్ల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ ర్యాంకులు ఇచ్చింది. కనీసంగా 10 క్లయింట్లు ఉన్న బిజినెస్ స్కూళ్ల పనితీరు ఆధారంగా ఈ ర్యాంక్‌లను ఇచ్చింది. వాటిలో ఐదు క్లయింట్ల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ ర్యాంక్‌లు ఇచ్చింది. బోధన పద్ధతులు, మెటీరియల్స్, డబ్బుకు ఇచ్చే విలువ, ప్రీపరేషన్, ప్రోగామ్ డిజైనింగ్, అంతర్జాతీయ క్లయింట్ల ముఖ్యమైన నిబంధనల గిటురాయిగా తీసుకున్నది. భారత్‌తోపాటు అంతర్జాతీయ స్థాయిలో ప్రభావాన్ని సృష్టించే వ్యాపారాలను నిర్మించడానికి, వృద్ధిచేయడానికి నిర్మించే ఎగ్జిక్యూటివ్‌లను ఐఎస్‌బీ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ తయారు చేస్తున్నది.

> ప్రపంచవ్యాప్తంగా వ్యాపారాలు, సమాజంలో పరివర్తనాత్మక మార్పును ప్రభావం చేయడానికి అవసరమైన జ్ఞానం, ప్రవర్తనలతో అభ్యాసకులను సన్నద్ధం చేయడంలో ఐఎస్‌బీ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ నిబద్ధత చాటుతున్నది. అధునాతన అభ్యాస బోధన విధానాలు, ప్రపంచస్థాయి అధ్యాపకుల నైపుణ్యం, అత్యాధునిక పరిశోధన, అభ్యాసకుల కేంద్రీకృత ఫలితాలు సృష్టించడానికి మరింత ప్రయత్నిస్తాం.
>
> - దీప మణి, ఐఎస్‌బీ డిప్యూటీ డీన్ ఆఫ్ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ అండ్ డిజిటల్ లెర్నింగ్

growel

పెట్ ఫుడ్‌లోకి గ్రోవెల్

హైదరాబాద్, మే 20: ఆక్వాకల్చర్ ఫీడ్స్, ఫార్ములేషన్ సంస్థ గ్రోవెల్ గ్రూపు.. తాజాగా పెంపుడు జంతువుల ఆహార రంగంలోకి అడుగుపెట్టింది. ఈ సందర్భంగా గ్రూపు ప్రమోటర్ కార్తీక్ మాట్లాడుతూ..భారత్‌లో పెంపుడు జంతువుల ఆహార రంగం భారీగా పుంజుకుంటున్నదని, దీంతో ఈ రంగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలనే ఉద్దేశంతో అడుగుపెట్టినట్టు చెప్పారు. ప్రస్తుతం సంస్థకు నాలుగు ప్లాంట్లు ఉండగా, తాజాగా మరో రెండు యూనిట్లను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. వచ్చే ఐదు నుంచి ఏడేండ్లకాలంలో రూ.80-100 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించారు.

ట్రిపుల్ ఐటీలో సీడ్ ఫండింగ్

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 20 (నమస్తే తెలంగాణ): స్టార్టప్‌లకు అవసరమైన సీడ్ ఫండింగ్ ఇచ్చేందుకుగాను ట్రిపుల్ ఐటీలోని సీఐఈ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది. 15 ఏళ్ల క్రితం ప్రారంభించిన సెంటర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్(సీఐఈ)లో నిధులు లేక సతమతమవుతున్న టెక్నాలజీ స్టార్టప్‌లకు ఆర్థికంగా సహాయ సహకారాలు అందిస్తున్నది. మరిన్ని వివరాలకు (https:// seed fund.startupindia.gov.in) సంప్రదించాలని సీఐఈ ప్రతినిధి తెలిపారు.

గోల్డ్ @ హైదరబాద్

ఆల్‌టైమ్ హైకి బంగారం ధరలు

24 క్యారెట్ 10 గ్రాములు రూ.75,160

22 క్యారెట్ తులం రూ.68,900

ఈ నెలలోనే 5 శాతం పెరిగిన రేట్లు

హైదరాబాద్, మే 20: బంగారం ధరలు హైదరాబాద్‌లో ఆల్‌టైమ్ హైకి చేరాయి. మునుపెన్నడూ లేనివిధంగా తులం రూ.75 వేలపైనే పలికింది. సోమవారం 10 గ్రాముల 24 క్యారెట్ పుత్తడి ధర తొలిసారి ఏకంగా రూ.75,160గా నమోదైంది. 22 క్యారెట్ కూడా రూ.68,900గా ఉన్నది. ఈ ఒక్కరోజే రూ.540, రూ.500 చొప్పున పెరిగాయి. మరోవైపు దేశ రాజధాని న్యూఢిల్లీలో గరిష్ఠంగా 24 క్యారెట్ పసిడి రేటు 10 గ్రాములు రూ. 75,310ని తాకింది. 22 క్యారెట్ కూడా రూ.69,050గా నమోదైంది.

20 రోజుల్లో 5% అప్

ఈ నెల మొదలు ఇప్పటిదాకా హైదరాబాద్‌లో గోల్డ్ ధర 5.1 శాతం ఎగబాకినట్టు మార్కెట్ గణాంకాలు చెప్తున్నాయి. మే 1న 22 క్యారెట్ పసిడి తులం రూ.65, 550 గా ఉన్నది. అలాగే 24 క్యారెట్ పుత్తడి రూ.71,510గా ఉన్నది. ప్రస్తుతం రూ.68, 900, రూ.75,160గా ఉన్నాయి. దీంతో గత 20 రోజుల్లో 22 క్యారెట్ బంగారం 10 గ్రాముల ధర రూ.3,350, 24 క్యారెట్ పసిడి తులం రూ.3,650 చొప్పున పెరిగినట్టైంది.

పెరుగుదలకు కారణాలేంటి?

దేశీయంగా బంగారం ధరలు ఇంతలా పెరుగుతుండటం వెనుక దేశ, విదేశీ కారణాలున్నాయని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. దేశీయ కారణాల్లో పెండ్లిళ్ల సీజన్ ఒకటైతే.. స్టాక్ మార్కెట్లలో తీవ్ర ఒడిదొడుకులు మరొకటి. మదుపరులు తమ పెట్టుబడి సాధనంగా బంగారాన్ని, ప్రధానంగా డిజిటల్ గోల్డ్‌ను చూస్తున్నారని చెప్తున్నారు. దీంతో డిమాండ్ సహజంగానే పెరుగుతున్నదని అంటున్నారు. ఇక రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గోల్డ్ రిజర్వులను పెంచుకుంటూపోతుండటం కూడా ధరలకు రెక్కల్ని తొడుగుతున్నదనీ పేర్కొంటున్నారు. విదేశీ కారణాల్లో ప్రధానంగా వినిపిస్తున్నది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల కోతల్ని ఆపేయడం, దీనివల్లే ఇన్వెస్టర్లు సురక్షితమైన పెట్టుబడిగా బంగారాన్ని చూస్తున్నారని మెజారిటీ ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు. అలాగే భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, ముఖ్యంగా మిడిల్‌ఈస్ట్ దేశాల్లో నెలకొన్న పరిణామాలు సైతం గోల్డ్ ధరలను ఎగదోస్తున్నాయని వ్యాఖ్యానిస్తున్నారు. ఇజ్రాయెల్-హమాస్ సంఘర్షణలతోపాటు రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కూడా మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నట్టు చెప్తున్నారు.

దేశంలోని ప్రధాన నగరాల్లో తులం బంగారం ధరలు (రూ.లలో)

నగరం	22 క్యారెట్	24 క్యారెట్
న్యూఢిల్లీ	69,050	75,310
చెన్నై	69,000	75,280
హైదరాబాద్	68,900	75,160
ముంబై	68,900	75,160
కోల్‌కతా	68,900	75,160

30న టీ హబ్‌లో ఓపెన్ హౌస్

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 20 (నమస్తే తెలంగాణ): ప్రారంభ దశలో ఉన్న స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు టీ హబ్ ఈనెల 30న ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. ఆలోచన దశ నుంచి వ్యాపార పరంగా అది కార్యరూపం దాల్చేందుకు ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునే క్రమంలో నిపుణులతో నెట్ వర్క్ మీటింగ్ ఉంటుందని, అలాగే ఆసక్తి ఉన్న వారు ఈ లింకు (https://bit.ly/thub-ideaopenhouse)లో నమోదు చేసుకోవాలని టీ హబ్ వర్గాలు సూచించారు.

నెక్ట్స్‌వేవ్‌లో 1,500 ఉద్యోగాలు

హైదరాబాద్, మే 20: హైదరాబాద్‌కు చెందిన ఎడ్యుటెక్ సేవల సంస్థ నెక్ట్స్ వేవ్..తాజాగా ఆఫ్‌లైన్ మార్కెట్లోకి ప్రవేశించింది. ఇందుకోసం హైదరాబాద్‌తోపాటు బెంగళూరు, చెన్నై, పుణె, కొచ్చిలలో 10 క్యాంపస్‌లను ఏర్పాటు చేయబోతున్నది. వచ్చే విద్యా సంవత్సరం నాటికి ఈ క్యాంపస్‌లు అందుబాటులోకి రానున్నట్లు, ఒక్కో క్యాంపస్‌లో 750 మంది విద్యార్థులు కూర్చోవడానికి వీలుంటుందని కంపెనీ కో-ఫౌండర్, సీఈవో రాహుల్ అట్లూరి తెలిపారు. బిట్స్ పీలానితో ఒప్పందం చేసుకొని ఈ క్యాంపస్‌లను నిర్వహిస్తున్నట్లు, ఇందుకోసం ఒక్కో క్యాంపస్ కోసం రూ.15-16 కోట్ల వరకు పెట్టుబడి పెడుతున్నట్లు, మొత్తంగా రూ.150-200 కోట్ల వరకు నిధులు ఖర్చు చేయనున్నట్లు ప్రకటించారు. గతంలో సేకరించిన నిధులతోనే ఈ పెట్టుబడులు చేయనున్నట్లు, కొత్తగా నిధులను సేకరించే ఉద్దేశమేది ప్రస్తుతానికి లేదన్నారు. అలాగే ఈ క్యాంపస్‌లు అందుబాటులోకి వస్తే కొత్తగా 1,500 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని, ప్రస్తుతం సంస్థలో 1,400 మంది విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

వాతావరణంతో ఆర్బీఐకి లింకేంటి?

ఎండలు, వర్షాల ఆధారంగానే వడ్డీరేట్ల సవరింపులు
రాబోయే ద్రవ్యసమీక్షల్లోని నిర్ణయాలూ అంతే

ముంబై, మే 20: ఎండల తీవ్రత, కుండపోత వర్షాలు సాధారణ ప్రజానీకానికే కాదు.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)కూ అసౌకర్యంగానే ఉంటాయి. ఆర్బీఐని అత్యంత ప్రభావితం చేసే అంశాల్లో వాతావరణం ఎప్పటికీ ముందు వరుసలో ఉంటుందన్నది మీకు తెలుసా మరి? అవును.. ఆర్బీఐ నిర్ణయాల్లో కీలకమైన వడ్డీరేట్ల సవరింపులు వాతావరణ పరిస్థితుల ఆధారంగానే ఉంటాయి. రెండు నెలలకోసారి జరుపుతున్న ద్రవ్యవిధాన పరపతి సమీక్షల్లో వెదర్ రిపోర్టుదే ప్రధాన పాత్ర. ఇంకా గట్టిగా చెప్పాలంటే యావత్తు దేశ ఆర్థిక వ్యవస్థ ప్రగతే వాతావరణంపై ఆధారపడి ఉంటుందన్నా అతిశయోక్తి కాదు.

ఇదీ సంగతి..

భారత్.. ఇప్పటికీ వర్షాధార పంటల దేశమే. ఇక ఆర్బీఐ ద్రవ్యవిధానం.. ద్రవ్యోల్బణం కట్టడి లక్ష్యాల (4 శాతం)కు అనుగుణంగా సాగుతుంది. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నా, వర్షాలు సమృద్ధిగా కురవకపోయినా లేదా అతిగా కురిసినా.. పంట దిగుబడులు తగ్గిపోతాయి. ఇదే జరిగితే మార్కెట్‌లో డిమాండ్‌కు తగ్గ సరఫరా లేక ద్రవ్యోల్బణం పెచ్చుమీరుతుంది. అప్పుడు దాన్ని తగ్గించేందుకు ఆర్బీఐ.. రెపో, రివర్స్ రెపో వడ్డీరేట్లను పెంచుతుంది. దీనివల్ల బ్యాంకుల రుణాలపై వడ్డీరేట్లు పెరుగుతాయి. ఇది సగటు మనిషి నుంచి, భారీ సంస్థలు, పరిశ్రమలదాకా ఎంతటి ప్రభావం చూపుతుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

ఈసారీ యథాతథమే..

వచ్చే నెల జరుగబోయే ద్రవ్యసమీక్షలోనూ రెపోరేటును ఆర్బీఐ యథాతథంగానే ఉంచుతుందన్న అంచనాలున్నాయి. ఏడాదికిపైగా కాలం నుంచి రెపోరేటును ఆర్బీఐ 6.5 శాతం వద్దే ఉంచుతున్నది. అయితే ఈసారి వర్షాలు సమృద్ధిగా కురిస్తే దీన్ని తగ్గించే వీలుందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అమెరికా ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల ప్రభావం కూడా ఉన్నప్పటికీ.. వాతావరణం బాగుంటే మాత్రం ఆ అంశానికి ఆర్బీఐ ఈ దఫా అంతగా ప్రాధాన్యత ఇవ్వకపోవచ్చని అంటున్నారు. మొత్తానికి వాతావరణం ఆశించినట్టుగా ఉంటే రుణ భారం తగ్గొచ్చని చెప్పవచ్చు.

ఐఐటీ జేఈఈలో మెరిసిన అల్ఫోర్స్

- బీఆర్క్, బీ ప్లానింగ్‌లోనూ మెరుగైన ర్యాంకులు

వినాయక్

అర్షిత రెడ్డి

శివమణి

కమాన్‌చౌరస్తా, మే 20: ఐఐటీ జేఈఈ-24, బీఆర్క్, బీ ప్లానింగ్ ఫలితాల్లో కరీంనగర్ అల్ఫోర్స్ విద్యార్థులు మెరిశారు. వివిధ కేటగిరీల్లో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. వినాయక్ గుగులోత్ బీఆర్క్‌లో 403, బీ ప్లానింగ్‌లో 375 వ ర్యాంకులు, బీఆర్క్‌లో కే అర్షితరెడ్డి 535, వై శివమణి 936, ఏ మౌనిక 1239, టీ పూజిత 1359, ఐ యోషిత 2096, సీ అర్షిత 2439, ఎస్ సాయిప్రసన్న 2511, ఆర్ మణిశ్రీ 3516వ ర్యాంకులు, కేశ్రేష్ట బీఆర్క్‌లో 4292 ర్యాంకు, బీప్లానింగ్‌లో 2498వ ర్యాంకు పొందింది. కాగా, ప్రతిభ చూపిన విద్యార్థులను కాలేజీ ఆవరణలో విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి సోమవారం అభినందించారు. మెరుగైన బోధనతోనే అత్యుత్తమ ఫలితాలు వచ్చాయని పేర్కొన్నారు.

ఆయువు తీస్తున్న ఆర్ఎంపీలు

- అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటం
- ఫస్ట్‌ఎయిడ్ కాదని.. పరిమితికి మించి వైద్యం
- హెవీ డోసులతో మృత్యు ఒడికి..
- 23 మందిపై కేసులు నమోదు చేసినా మారని తీరు

సాయి పల్లవి (ఫైల్)

మంచిర్యాల ఏసీసీ, మే 20 : మంచిర్యాల జిల్లా ఆర్ఎంపీలు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అనారోగ్యంతో వచ్చే వారికి ఫస్ట్ ఎయిడ్ మాత్రమే చేయాల్సి ఉండగా, పరిమితి దాటి వైద్య మందిస్తూ ఆయువు తీస్తున్నారు. ఆర్ఎంపీలు, పీఎంపీల మీద పత్రికల్లో వస్తున్న వరుస కథనాల నేపథ్యంలో వైద్య, ఆరోగ్యశాఖాధికారులు నిత్యం సమావేశాలు నిర్వహించి హెచ్చరిస్తున్నా వారు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఎన్ఎంఏ, టీఎస్ఎంఏ బృందాలు ఇటీవల ఆకస్మిక తనిఖీలు నిర్వహించి 23 మందిపై కేసులు నమోదు చేసినా, వారి తీరు మారడం లేదు.

ఇటీవలి ఘటనలు..

మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని ఓ ఏరియాకు చెందిన బాలింతకు ఇటీవల జ్వరం రాగా, అందుబాటులో ఉన్న ఆర్ఎంపీ వద్దకు కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. బాలింతను పరీక్షించిన ఆర్ఎంపీ.. ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లాలని సూచించాల్సింది పోయి హెవీ డోస్ యాంటీబయాటిక్స్ ఇంజక్షన్ ఇచ్చాడు. దీంతో బాలింతకు ఒక్కసారిగా బీపీ పెరిగి బాడీ షివరింగ్ మొదలైంది. వెంటనే పెద్దాసుపత్రికి తీసుకెళ్లగా, ఒకరోజు చికిత్స అందించి ఇంటికి పంపారు. ఇంజక్షన్ వేసిన చోట గడ్డలు కావడంతో సర్జరీ చేసి తొలగించినట్లు తెలిసింది. అలాగే రామకృష్ణాపూర్‌కు చెందిన ఓ ఆర్ఎంపీ మూడు నెలల క్రితం తీవ్ర జ్వరంతో బాధపడుతున్న ఎనిమిదేండ్ల పాపకు వైద్యం అందించాడు. తీరా జ్వరం తగ్గకపోగా మరుసటి రోజు ఫిట్స్ వచ్చి పాప పరిస్థితి ప్రమాదకరంగా మారింది. వెంటనే మంచిర్యాల ప్రభుత్వ జనరల్ దవాఖానకు తీసుకెళ్లగా వైద్యం అందిస్తుండగానే పాప మృత్యు ఒడికి చేరింది. ఆర్ఎంపీ హెవీడోస్ యాంటీ బయాటిక్స్ ఇంజక్షన్లు ఇవ్వడం ద్వారానే హైపర్ టెన్షన్‌కు వెళ్లి కార్డియాక్ రెస్టోతో పాప చనిపోయి నట్లు వైద్యులు నిర్ధారించారు. బాధిత కుటుంబానికి కొంత ముట్ట జెప్పి చేతులు దులుపుకున్నట్లు విశ్వశనీయ సమాచారం. అలాగే కొద్ది రోజుల క్రితం.. లక్షెట్టిపేటకు చెందిన 12ఏండ్ల పాపకు జ్వరం రాగా, స్థానిక ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. అతడు ఇంజక్షన్ వేసి నా తగ్గలేదు. వారం పాటు యాంటీబయాటిక్స్‌తో వైద్యం అందించాడు. 10రోజుల తర్వాత కండ్లు పచ్చబడడంతో ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా జాండీస్ అని తేలింది. దీంతో చేసేదేమీ లేక కుటుంబ సభ్యులు అక్కడే వారంపాటు వైద్యం అందించారు.

తాజాగా మరో బాలిక బలి

వేమనపల్లి, మే 20 : ఆర్ఎంపీ వైద్యం వికటించి ఓ బాలిక మృతి చెందింది. నెన్నెల మండల కేంద్రానికి చెందిన కొమ్మెర అంజన్న-భాగ్యలక్ష్మి దంపతుల కూతురు సాయిపల్లవి (11) ఇటీవల తన అమ్మమ్మ ఊరైన వేమనపల్లి మండలం కల్మల పేటకు వచ్చింది. ఆదివారం రాత్రి సాయి పల్లవికి ఛాతిలో నొప్పి రావడంతో నీల్వాయి గ్రామంలోని ఆర్ఎంపీ సంతోష్ వద్దకు కుటుంబ సభ్యులు తీసుకువెళ్లారు. సాయి పల్లవికి ఆర్ఎంపీ ఇంజక్షన్ వేశాడు. కొంత సమయానికే పల్స్, బీపీ పడిపోయి నాలుక మందం కాగా, 108 అంబులెన్స్‌లో చెన్నూరులోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందింది. ఆర్ఎంపీ నిర్లక్ష్యంతోనే సాయిపల్లవి మృతి చెందిందని ఆమె తల్లి భాగ్యలక్ష్మి నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్యామ్‌పటేల్ తెలిపారు.

తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీ శివారులో నరికేసిన హరిత హారం చెట్లు

విద్యుత్ తీగల కింద ఉన్న మొక్కలను తిరిగి ఎదగకుండా నరికేసిన దృశ్యం

హరిత హననం

- పచ్చదంపై పట్టింపేదీ?
- చెట్లను నరుకుతున్నా అధికారుల్లో స్పందన కరువు
- నీళ్లు లేక ఎండిపోతున్న హరితహారం మొక్కలు
- గత ప్రభుత్వ హయాంలో యజ్ఞంలా కార్యక్రమం
- ఇప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సర్కారు

> పర్యావరణాన్ని పరిరక్షించే లక్ష్యంతో గత కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన హరితహారం కార్యక్రమం ఇప్పుడు హరితహననంగా మారిపోయింది. మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకుని అప్పటి సర్కారు పచ్చదనం పెంపునకు కృషి చేయగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఎవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలను విచ్చల విడిగా నరికేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. నిండు వేసవిలోనూ మొక్కలను రక్షించేందుకు నాటి ప్రభుత్వం ట్యాంకర్లతో నీళ్లు పోయించగా, ఇప్పుడు పట్టింపు లేకుండా పోవడంతో ఎదిగి వచ్చిన వేలాది మొక్కలు ఎండిపోతున్నాయి. రెండు సార్లు జిల్లాలో పర్యటించి మొక్కలు నాటిన అప్పటి సీఎం కేసీఆర్ స్ఫూర్తిగా నిలవగా, ప్రజల భాగస్వామ్యంతో నాటిన మొక్కలకు ఇప్పుడు రక్షణ లేకుండా పోయింది.
>
> -కరీంనగర్, మే 20 (నమస్తే తెలంగాణ)

హరితహారం అంటేనే ఒక బృహత్తర కార్యక్రమం. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారంలోకి వచ్చిన రెండో ఏడాది 2015 జూలై 2న ఈ మహాయజ్ఞాన్ని ప్రారంభించారు. అదే ఏడాది జూలై 4న జిల్లాలో పర్యటించి చిగురుమామిడి మండలం ముల్కనూర్, తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్, ధర్మారం మండల కేంద్రంలో మొక్కలు నాటారు. మూడో విడుత హరితహారం కార్యక్రమాన్ని కేసీఆర్ జిల్లా కేంద్రంలోని మానేరు తీరంలో మహాగని మొక్క నాటి ప్రారంభించారు. ఈ స్ఫూర్తితో హరితహారంలో ప్రజల భాగస్వామ్యం పెరిగింది. ప్రతి ఏటా జూన్, జూలై నెలల్లో చేపట్టిన హరితహారంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటేవారు. పచ్చదనం నిత్యం పరిఢవిల్లాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో నర్సరీలు ఏర్పాటు చేసి ఆ గ్రామానికి అవసరమైన మొక్కలను సదరు నర్సరీలోనే పెంచేందుకు ఏర్పాట్లు చేసింది. ప్రతి గ్రామంలో పల్లె ప్రకృతి వనాలు, ప్రతి మండలంలో బృహత్ పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. అంతే కాకుండా, ప్రతి ఏటా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ పండ్ల మొక్కలు పంపిణీ చేసింది. వాటిని పెంచే బాధ్యతను ప్రజలకు అప్పగించింది. పచ్చదనం పెంచే కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా చేపట్టిన అప్పటి ప్రభుత్వం ప్రభుత్వ శాఖలకు లక్ష్యాలు విధించింది. దీంతో ప్రతి శాఖ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను స్వీకరించింది. జిల్లాలోని పల్లెలు, పట్టణాల్లో పచ్చదనం పెరిగింది. మొక్కలను సంరక్షించేందుకు ట్యాంకర్లను ఏర్పాటు చేసింది. గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా మొక్కలను సంరక్షించింది. దీంతో జిల్లాలో పచ్చదనం పెరిగింది.

చెట్లను కొట్టేస్తున్నారు

గత ప్రభుత్వ హయాంలో అనేక రకాల మొక్కలను నాటారు. టేకు, ఎర్ర చందనం, వెదురు, సిల్వర్ ఓక్, ఈత, తాటి, కానుగ, తుమ్మ, గుల్మోహర్, జామ, మునగ, నిద్ర గన్నేరు, ఉసిరి, సుబాబుల్, నేరేడు, సీమ తంగేడు, సీతాఫలం, జామ, మామిడి ఇలా అనేక రకాల మొక్కలను పెంచారు. వీటిలో ఇప్పుడు కోట్లాది మొక్కలు వృక్షాలుగా ఎదుగుతున్నాయి. అయితే, ఎవెన్యూ ప్లాంటేషన్‌లో పెట్టిన మొక్కలకు రక్షణ లేకుండా పోయింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిండు వేసవిలో చెట్లకు నీళ్లు పోసేందుకు ట్యాంకర్లు ఏర్పాటు చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించక పూర్తిగా ఎండిపోతున్నాయి. ఎదుగుతున్న మొక్కలకు ట్రీ గార్డులు లేకుండా పోయాయి. దీంతో వాటిని పశువులు మేస్తున్నాయి. ముఖ్యంగా ప్రధాన రహదారుల వెంట ఉన్న చెట్లను విద్యుత్ సిబ్బంది విచ్చల విడిగా నరికేస్తున్నారు. విద్యుత్ తీగల కింద ఉన్న చెట్లకు గతంలో కొమ్మలు కొట్టేసే వాళ్లు. కానీ, ఇప్పుడు అడిగే వారు లేకపోవడంతో మొదళ్లనే నరికేస్తున్నారు. నిన్నా మొన్నటి వరకు చెట్లతో కళకళలాడిన రహదారులు ఇప్పుడు ఎక్కడ చూసినా నరికిన చెట్ల మొదళ్లతో పొరక పొరకగా కనిపిస్తున్నాయి. రహదారుల వెంట ఉన్న ఎవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కల బాధ్యతలను స్థానిక సర్పంచులు చూసేవారు. సర్పంచుల పదవీ కాలం కూడా ముగియడంతో పరిస్థితులు మారిపోయాయి. ఇప్పుడు వాటిని పట్టించుకునే వారు లేకుండా పోయారు.

తిమ్మాపూర్ మండలం ఇందిరానగర్ వద్ద నీళ్లు లేక ఎండిపోతున్న మొక్కలు

విచక్షణా రహితంగా నరికివేత

రాజీవ్ రహదారి వెంట ఇప్పుడు ఎక్కడ చూసినా నరికిన చెట్లే కనిపిస్తాయి. మొక్క ఎదిగీ ఎదగగానే మొదలు విద్యుత్ సంస్థ సిబ్బంది గొడ్డలి వేటు పడుతున్నది. తీగలకు అంటుతున్నాయనే కారణంతో పూలు, నీడ నిచ్చే చెట్లను విచ్చల విడిగా నరికేస్తున్నారు. జిల్లాలోని రాజీ